క్లుప్తంగా

13 నుంచి ప్రతిభా పోటీలు

దాబాగార్డెన్స్: దేశ 76వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 13 నుంచి 15 వరకు ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఐయామ్ యాన్ ఇండియన్–ఐ లవ్ మై ఇండియా' పేరిట ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా మూడు రోజుల పాటు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు పోటీలు ఉంటాయన్నారు. క్లాసికల్, ఫోక్, వెస్ట్రన్ డ్యాన్స్, సింగింగ్, గెటప్స్, డ్రాయింగ్ పోటీలు, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, ట్రెడిషనల్ అండ్ ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌తోపాటు మెమెంటో అందజేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 99664 85335 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సబ్సిడీ టమాటాకు డిమాండ్


సీతమ్మధార రైతుబజార్‌లో బారులు తీరిన వినియోగదారులు

సీతమ్మధార: సబ్సిడీ టమాటా కోసం సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం వినియోగదారులు బారులు తీరారు. రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధార్, రేషన్ కార్డు చూపించిన వారికి కిలో టమాటా రూ.50కు విక్రయించారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్, సిబ్బంది పర్యవేక్షించారు.

బీమా పరిహారం అందజేత


నామినీలకు బీమా చెక్కు అందజేస్తున్న ఏపీజీవీబీ అధికారులు

దాబాగార్డెన్స్: ప్రమాదవశాత్తు మరణించిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ) ఖాతాదారులకు ఆ బ్యాంక్ ప్రతినిధులు సోమవారం ఇన్సూరెన్స్ పరిహారం అందజేశారు. కైలాసపురం, హెచ్‌బీ కాలనీ శాఖలకు చెందిన పాలసీదారులు(బీమా చెల్లించినవారు) టి. ఉమ, పి.రామకృష్ణకు సంబంధించి రూ.10 లక్షల క్లైమ్‌ను వారి మరణానంతరం నామినీ లు టి.సాయి, పి.హరీష్‌కు ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ ఆంధ్రా జీఎం శ్రీరామ సోమయాజి, ఆర్ఎం ఎస్.సతీష్‌చంద్ర, నోడల్ ఆఫీసర్ ఆకుల శివకుమార్, ఎస్‌బీ ఐ జనరల్ ఇన్సూరెన్స్ క్లస్టర్ సేల్స్ మేనేజర్ జి.సురేష్‌బాబు, బీడీఎం జె.సోమేశ్వరరావు, పలువురు బ్రాంచ్ మేనేజర్లు పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి నేడూ దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు స్వీకరిస్తున్న కళాశాల సిబ్బంది

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మంగళవారం కూడా దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. సోమవారంతో గడువు ముగిసిపోయినప్పటికీ ఒక రోజు పొడిగించామని చెప్పారు. విద్యార్థులు సీటు అలాట్‌మెంట్ ఆర్డర్‌తోపాటు అన్ని సర్టిఫికెట్లతో మంగళవారం హాజరు కావాలని ఆయన కోరారు.

అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

'జగనన్న సురక్ష'తో పెద్దమేలు


43వ వార్డులో సర్టిఫికెట్లు అందజేస్తున్న కె.కె.రాజు, జెడ్సీ కృష్ణ, కార్పొరేటర్ ఉషశ్రీ(ఫైల్)

- ప్రజలకు విశేష సేవలందించిన కార్యక్రమం
- 'ఉత్తర'లో 16,567 సర్టిఫికెట్ల అందజేత
- ఉచిత సేవలపై సర్వత్రా హర్షం

సీతంపేట: ప్రభుత్వ సేవలు నూటికి నూరు శాతం ప్రజలకు అందాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతో మందికి లబ్ధి చేకూరింది. గతంలో కుల, ఆదాయ మొదలగు ధ్రువపత్రాల కోసం ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ రోజుల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. సీఎం జగన్ పాలనలో నేడు ఆ పరిస్థితి మారింది. ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దే ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సీఎం పేషీకి వచ్చిన వినతులు, సమస్యలను బట్టి ప్రజల అవసరాలు తీర్చేలా జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా ప్రతి వలంటీర్ తన పరిధిలోని ఇళ్లను సందర్శించి జగనన్న సురక్ష ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్ల వివరాలను సేకరించి సచివాలయ కార్యదర్శుల ద్వారా అప్‌లోడ్ చేయించారు.

జోన్–3, జోన్–5 పరిధుల్లో..

జూలై 1 నుంచి 31 వరకు ఉత్తర నియోజకవర్గంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ప్రతి వార్డులో జగనన్న సురక్ష క్యాంపులు ఏర్పాటు చేసి దరఖాస్తు చేసుకున్న రెండు, మూడు రోజుల్లోనే లబ్ధిదారుల చేతికి సర్టిఫికెట్లు అందజేశారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు.. వార్డులు, సచివాలయాలు, క్లస్టర్ల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించి ప్రతి వార్డులో జగనన్న సురక్ష లబ్ధి పూర్తి స్థాయిలో ప్రజలకు అందేలా చర్యలు చేపట్టారు. ఫలితంగా 92 శాతం మంది దరఖాస్తుదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశారు. నియోజకవర్గంలోని జీవీఎంసీ జోన్–5 పరిధిలోని 13 వార్డులకు సంబంధించి 13,533 టోకెన్లు మంజూరు చేయగా.. 12,769 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఇందులో 7,017 కుల, 3,129 ఆదాయ, 53 రైస్‌కార్డులు, 83 ఓబీసీ సర్టిఫికెట్లు ఉన్నాయి. జోన్–3 పరిధిలోని 14, 24, 25, 26 వార్డుల్లో లబ్ధిదారులకు 3,798 సర్టిఫికెట్లు అందించారు. ఇల్లు కదలకుండానే అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా.. సులభంగా ప్రభుత్వం అందజేయడంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో లబ్ధిదారులకు అందించిన ధ్రువపత్రాల వివరాలు

వార్డు నం.	సర్టిఫికెట్లు	వార్డు నం.	సర్టిఫికెట్లు
14	448	47	1,034
24	1,034	48	1,088
25	1,469	49	1,441
26	847	50	611
42	580	51	1,519
43	1,016	53	861
44	1,467	54	1,051
45	798	55	379
46	924	--	--

అధికారుల చుట్టూ తిరిగే పనితప్పింది



కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం గతంలో అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. జగనన్న సురక్ష ద్వారా వలంటీర్, సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చి ఏ సర్టిఫికెట్లు కావాలని అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎక్కడికీ తిరగకుండా సులభంగా రెండు సర్టిఫికెట్లు అందజేశారు. చాలా సంతోషం అనిపించింది.

– నార్ని దేవి, శ్రీనివాసనగర్

ఇల్లు కదలకుండానే సర్టిఫికెట్లు అందాయి



సంక్షేమ పథకాలకు క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు అడుగుతున్నారు. వాటి కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగ లేక ఊరుకున్నాను. వలంటీర్, సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చి జగనన్న సురక్ష కార్యక్రమ సేవల గురించి వివరించారు. వాటి కోసం దరఖాస్తు చేయించారు. ఇల్లు కదలకుండా సర్టిఫికెట్లు వచ్చాయి.

– మజ్జి ఆరుద్రమ్మ, పెద్దూరు

తాటిచెట్లపాలెం జంక్షన్‌లో నిరసన హోరు



కె.కె.రాజు ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ శ్రేణులు

తాటిచెట్లపాలెం: పుంగనూరులో జరిగిన విధ్వంస కాండకు కారణమైన ప్రతిపక్ష నేత చంద్రబాబు, టీడీపీ వైఖరిని నిరసిస్తూ సోమవారం జాతీయ రహదారి తాటిచెట్లపాలెం జంక్షన్‌లో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో భారీ మానవ హారం నిర్వహించారు. పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొని చంద్రబాబుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం


వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న గొండు సీతారాం


గర్భిణులకు పోషకాహార కిట్లు అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

సీతంపేట: తల్లిపాలే బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. అక్కయ్యపాలెం షాదీఖానా సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ తల్లులు పౌష్టికాహారం స్వీకరించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయని గుర్తుచేశారు. అయినప్పటికీ అక్కడక్కడ మాతా, శిశు మరణాలు సంభవిస్తుండటం విచారకరమన్నారు. వీటి నివారణకు ప్రభుత్వంలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలపై ఫిర్యాదులొస్తే తమ కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టి తక్షణ చర్యలకు ఆయా జిల్లాల ఉన్నతాధికారులకు సిఫార్సులు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్లు రమణికుమారి, శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, మండల విద్యా శాఖాధికారి బాలామణి, సీఆర్‌పీ భాగ్యలక్ష్మి, చైల్డ్‌లైన్ ప్రతినిధి శారద, మహిళా పోలీసులు, ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

మద్దిలపాలెం: తల్లిపాలు అందించడం వల్ల బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అన్నారు. వార్డులోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు ఆయన చేతుల మీదుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులకు అవగాహన కల్పించారు. నవజాత శిశువుల సరైన అభివృద్ధిపై అవగాహన కల్పించడమే తల్లిపాల వారోత్సాల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ, సచివాలయ మహిళా పోలీస్ వరలక్ష్మి, ఆర్.ఆశ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు రక్షణగా 'మిషన్ ఇంద్రధనస్సు'


చాకలిపేట సచివాలయంలో పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న హెల్త్ సెక్రటరీ తంబది


నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి విటమిన్–ఏ డ్రాప్స్ వేస్తున్న ఏఎన్ఎం కృష్ణవేణి

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డులో సోమవారం మిషన్ ఇంద్రధనస్సు 5.0 కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధి రామకృష్ణానగర్ చాకలిపేట సచివాలయంలో వార్డు హెల్త్ సెక్రటరీ తంబది చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా ఐదేళ్ల లోపు పిల్లలకు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందకపోవడం లేదా వ్యాధి నిరోధక టీకాల షెడ్యూల్ మధ్యలో ఆపివేసిన డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి వారికి సమాచారం ఇచ్చి వారందరికీ వ్యాక్సిన్ వేస్తామని చెప్పారు. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా యు–విన్ యాప్ ఏర్పాటు చేసిందని, టీకాలు వేసుకో దలచిన వారు దానిలో నమోదు చేసుకుని వ్యాక్సిన్ తీసుకోవచ్చని తెలిపారు.

పిల్లలకు రేచీకటి రాకుండా డ్రాప్స్

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం చేపట్టారు. పుట్టిన నెలల పిల్లలకు విటమిన్–ఏ డ్రాప్స్‌ను ఏఎన్ఎం కృష్ణవేణి వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నపిల్లలకు రేచీకటి రాకుండా మూడు నెలల పాటు విటమిన్–ఏ డ్రాప్స్ వేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఒక సారి డ్రాప్స్ వేసుకోవాలని సూచించారు. తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వరకు విటమిన్–ఏ డ్రాప్స్ వేయలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఎం.సావిత్రి, ఆశా వర్కర్లు పి.భవాని, కె.సత్యకుమారి, అంగన్‌వాడీ టీచర్ గౌరి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్–మర్రిపాలెం మధ్య కోచింగ్ డిపో సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన గుర్తు తెలియని ఒక వ్యక్తి మరణించాడు. విశాఖ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. కోచింగ్ డిపో సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మరణించాడు. ఇతడి వయసు సుమారు 35–40 సంవత్సరాలు. ఎత్తు సుమారు 5.6 అడుగులు. శరీరం కుళ్లిపోయి నల్లగా మారడంతో గుర్తించడానికి కూడా వీలులేకుండా ఉంది. ఇతను (అడిడాస్ పేరు గల) నలుపు రంగు ఫుల్ లోయర్, తెలుపు, నలుపు, పచ్చని రంగుల గీతలు గల టీ షర్ట్ ధరించి ఉన్నాడు. జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు ఆదేశాలతో ఎస్ఐ బాలాజీరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ బాలాజీరావు కోరారు.

కారును ఢీకొట్టిన కంటైనర్


సత్యం జంక్షన్‌లో కారును ఢీకొట్టిన కంటైనర్

సీతమ్మధార: జాతీయ రహదారిపై సత్యం జంక్షన్‌లో ఓ కారును కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ఘటన లో కారు డోర్ దెబ్బతింది. వివరాలిలా.. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో గురుద్వారా నుంచి మద్దిలపాలెం వైపు భారీ కంటైనర్(ఒడిశాకు చెందిన) వెళ్తున్న క్రమంలో సత్యం జంక్షన్ వద్ద సిగ్నల్ పడింది. టీఎస్07ఎఫ్ ఎస్ 9857 నంబర్ గల కార్ సీతమ్మధార నుంచి గురుద్వారా వైపు వెళ్లే సమయంలో కంటైనర్ దానిని ఢీకొంది. జంక్షన్‌లో ఉన్న వారంతా కారు డ్రైవ్ చేసిన వ్యక్తిని కాపాడేందుకు వచ్చారు. ఎటువంటి ప్రమాదం జరగలేదు. అంతా ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు వచ్చి కార్‌కు ఒక పక్కన పెట్టారు. సుమారు అర్ధగంట పాటు ట్రాఫిక్ జామైంది.

నూతన పాఠశాల భవనం ప్రారంభం


నూతన భవనంలో విద్యార్థులతో డిప్యూటీ మేయర్ సతీష్, సీతారాం, అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురంలోని లక్ష్మీనారాయణపురంలో కొత్తగా నిర్మించిన సామాజిక భవనాన్ని సోమవారం ముఖ్య అతిథి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. ఇటీవల శాంతినగర్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన ఆయన.. అది శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనలు చెందుతున్నట్లు గుర్తించారు. విద్యార్థుల ఇబ్బందుల దృష్ట్యా లక్ష్మీనారాయణపురంలో రూ.10 లక్షలతో నిర్మించిన సామాజిక భవనంలో శాంతినగర్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసినట్లు సతీష్ తెలిపారు. అనంతరం తరగతి గదుల్లో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. మరో అతిథి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ మాట్లాడుతూ భవితకు భద్రత కల్పించడం బాలల హక్కుల విజయంగా భావిస్తున్నామన్నారు. ఏడీసీ శ్రీనివాసరావు, కో–ఆప్షన్ సభ్యుడు ఎస్.అప్పారావు, కోట రామారావు, నాగరాజు, కృపా, ఉపాధ్యాయ సిబ్బంది, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలకు పెద్దపీట

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో సోమ వారం మహాశక్తి–భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమం ప్రారంభమైంది. టీడీపీ వార్డు అధ్యక్షురాలు బి.పద్మలత ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. క్రాంతినగర్, గాంధీనగర్‌ల్లో ప్రచార రథం ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. 26వ వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, పార్లమెంట్ కమిటీ కార్యదర్శి బొడ్డేపల్లి లలిత, ఉత్తర మహిళ అధ్యక్షురాలు తోట శ్రీదేవి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'కు 20 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్


వినతిపత్రాలు స్వీకరిస్తున్న జెడ్సీ కృష్ణ

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 20 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం

కంచరపాలెం: ప్రజా వినతుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 04 అర్జీలు అందాయి. పలువురి నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 02, యూసీడీ విభాగానికి 02 చొప్పున వినతులు అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్–1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆఫీసర్లు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ–2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీలు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్రోద్యమంలో ఖాదీకి ప్రత్యేక స్థానం


వక్తృత్వ పోటీలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

మురళీనగర్: భారత స్వాతంత్య్రోద్యమంలో ఖాదీకి ప్రత్యేక స్థానం ఉందని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు అన్నారు. సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు సోమవారం కాలేజీలో 9వ జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ స్వదేశీ ఉద్యమంలో భాగంగా ఖాదీ పరిశ్రమను ప్రోత్సహించినట్లు వివరించారు. గాంధీ రాట్నంతో నూలు దుస్తులు తయారుచేసి ధరించేవారని, దేశంలో కుటీర పరిశ్రమలు అభివృద్ధి చెందాలని ఆయన కోరుకున్నారని గుర్తుచేశారు. చేనేత పరిశ్రమ మనదేశానికి ఎంతో ఖ్యాతి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. జనరల్ శాఖాధిపతి డాక్టర్ పి.ఎం.బాషా, ఇంగ్లిష్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ యమున ప్రసంగించారు. ఈ సందర్భంగా ×సెలబ్రేటింగ్ ఇండియన్ హ్యాండ్లూమ్స్, వీవింగ్ అవర్ కల్చరల్ హెరిటేజ్ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 20 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రైతులకు సహకరిద్దాం


మాట్లాడుతున్న ఆడారి కిషోర్‌కుమార్

మురళీనగర్: రైతులు తాము పండించిన పంటలకు తగిన గిట్టుబాటు పొందడానికి వారి పంటను తమకు నచ్చిన ధరకు అమ్ముకోవడానికి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సహకరిస్తుందని మిషన్ కర్షక దేవోభవ చైర్మన్ ఆడారి కిషోర్‌కుమార్ తెలిపారు. కర్షక దేవోభవ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం కంచర పాలెంలోని ఐజీఐఏటీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కేంద్రాలపై తగిన ప్రచారం లేదన్నారు. మనం రోజు తినే ఆహారాన్ని పండించే రైతులు అమ్మే కూరగాయలు, ఇతర పంటలు కొనే సమయంలో ఎటువంటి బేరాలు చేయవద్దని చెప్పారు. నిత్యం శ్రమటోడ్చి తాము పండించిన ఆహార పదార్థాలను దేశానికి అందిస్తున్న రైతులకు ప్రతి ఒక్కరూ కృతజ్ఞతతో ఉండాలన్నారు. విద్యావంతులు సామాజిక బాధ్యతగా అన్నదాతలకు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఈ మిషన్‌లో వలంటీర్లుగా పనిచేసేందుకు యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఐజీఐఏటీ నిర్వాహకులు, మిషన్ కర్షక దేవోభవ ప్రతినిధులు శ్రీధర్, ముకేశ్, మహేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం


రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న బుచ్చయ్య

మురళీనగర్: పదవీ విరమణ పొందిన ఉద్యోగులను వైశాఖి స్పోర్ట్స్ పార్క్ సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. పార్కులో పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పీవీఎస్ రాజు, కోరాడ మురళీధర్, సీహెచ్ ప్రసాద్‌లను పార్క్ వ్యవస్థాపకుడు నిమ్మగడ్డ బుచ్చయ్య చేతుల మీదుగా సత్కరించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో పార్కు కార్యదర్శి పాట్నూరు నాగరాజు, ఉపాధ్యక్షుడు బోయపాటి శ్రీనివాస్, కోశాధికారి కుర్మారావు, సంయుక్త కార్యదర్శి స్వామి, మళ్ల రామకృష్ణ, కనకరాజు, శ్రీరఘురామ, పండా తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్'కు సహకరించండి


సిటిజన్ ఫీడ్‌బ్యాక్ నమోదు చేస్తున్న మురళీనగర్ ప్రాంతవాసులు

మురళీనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో జీవీఎంసీకి మొదటి ర్యాంకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ కోరారు. సోమవారం నిర్వహించిన సర్వేలో జోన్–5 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రాధాన్యాన్ని మురళీనగర్ వాసులకు వివరించారు. 49, 50 వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిటిజన్ ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరుగా అందించాలని డాక్టర్ సునీల్ కోరారు. వాకర్స్ పార్క్ సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.